
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 12 ఆగస్టు 2025

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని ఆదిత్యాలయంలో ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు నియామకం జరుగుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు ప్రొఫార్మా-2 ప్రకారం దరఖాస్తులను ఆలయ ఈవో చిరునామా పేరుతో ఈ నెల 27 లోగా పంపాలి. కవరుపై ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు అని పేర్కొనాలి. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయంలో కానీ లేదా 89789 14660, 94910 00708 నెంబర్లను సంప్రదించాలి' అని ఈవో సూచించారు.



డీఎస్సీ రాసిన అభ్యర్థులు (ఫైల్)

4 రోజులు ముందే..

- డీఎస్సీ ఫలితాలు ప్రకటించిన ప్రభుత్వం
- నెలాఖరున పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం
- రిజర్వేషన్ మేరకు అభ్యర్థుల ఎంపిక

నరసన్నపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ముందడుగు వేసింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ సమయంలో ఆగస్టు 15 నాటికి ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించింది. నాలుగు రోజుల ముందే.. సోమవారం ఫలితాలు ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 20న ఉమ్మడి జిల్లాలో 543 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మునిసిపాలిటీల్లో 458 పోస్టులతోపాటు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో 85 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. జిల్లాలో సుమారు 34 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని శ్రీకాకుళం, రాజాం , టెక్కలి, నరసన్నపేటలో జూన్ 6 నుంచి జూలై 2 వరకు పరీక్షలను నిర్వహించారు. ఒక్కో పోస్టుకు సుమారు 70 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. సోమవారం ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్టీటీలు ఎక్కువగా అర్హత సాధించారు. దాదాపు 80 శాతం మేరకు అత్యధిక మార్కులు పొందారు. ఇక స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు.. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు, ఇతర శాఖల్లో పని చేస్తున్న అభ్యర్థులు మంచి (మిగతా 6వ పేజీలో..)

తోలాపి యువకుడికి 96.4 మార్కులు



పొందూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన యువకుడు **అన్నెపు శేషాద్రినాయుడు** ప్రతిభ కనబరిచాడు. ఎస్జీటీ విభాగంలో శేషాద్రినాయుడు 96.40176 మార్కులు సాధించాడు. శేషాద్రినాయుడు తండ్రి అన్నెపు ధర్మారావు, తల్లి జగదాంబ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు. శేషాద్రినాయుడుకి గ్రామస్థులు అబినందనలు తెలిపారు.



హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, విద్యార్థులు, తదితరులు

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- నగరంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

6లో



ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రైతులు

చంద్రన్నా.. సుఖీభవ

- నరసన్నపేటలో ట్రాక్టర్లతో రైతుల విజయోత్సవ ర్యాలీ
- అన్నదాతకు అండగా కూటమి పాలన: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా చంద్రన్న పాలన కొనసాగుతోంద'ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులను మంజూరు చేయడంతో సోమవారం స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తి ఆధ్వర్యంలో రైతులు ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సుమారు 200 ట్రాక్టర్లతో స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి సత్యవరం జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. 'చంద్రన్నా.. సుఖీభవ' అంటూ హోరెత్తించారు. ఎన్నికల హామీ నిలబెట్టుకుని అన్నదాత సుఖీభవ పథకం కింద తొలివిడతగా రూ.7వేలు చొప్పున జమ చేసిన సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి (మిగతా 6వ పేజీలో..)

వినతులన్నీ పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదిక.. మీ-కోసం కార్యక్రమంలో నమోదైన అన్ని వినతులను క్షుణ్ణంగా పరిశీలించి.. సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ-కోసం' కార్యక్రమంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్‌తో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 86 వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

14న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 14న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరుగనున్నాయని జడ్పీ సీఈవో ఎల్.ఎస్.వి.శ్రీధర్ రాజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమావేశాలు జరుగుతాయని, సభ్యులు, సంబంధిత అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.



ఇచ్ఛాపురంలోని పోస్టల్ కార్యాలయం

రిజిస్టర్ పోస్టుకు సెలవు!

- స్పీడ్ పోస్టులో విలీనం
- సెప్టెంబరు 1 నుంచి అమలు
- తపాలాశాఖ కీలక నిర్ణయం

ఇచ్ఛాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలతో పోస్టల్ శాఖది విడదీయరాని బంధం. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రాని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక దిక్కు పోస్టల్. ఈ శాఖ కాలంతోపాటు మారుతూ.. ప్రైవేటు సంస్థలకు దీటుగా సమాచార సేవను కొనసాగిస్తోంది. పౌరసేవలు, ప్రజలకు బ్యాంకింగ్ సేవలను సైతం అందిస్తోంది. కాగా బ్రిటీష్ కాలం నాటిదైన రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టు విభాగంలో విలీనం చేయాలని భారత తపాలాశాఖ నిర్ణయించింది. సెప్టెంబరు 1 నుంచి దీనిని అమలు చేయనుంది. అంటే ఇకపై పోస్టల్‌శాఖలో రిజిస్టర్ పోస్టు కనుమరుగు కానుంది.

బ్రిటీష్ కాలం నాటిది..

పోస్టల్ శాఖలో రిజిస్టర్ పోస్టుది సుదీర్ఘ చరిత్ర. 1854లో రిజిస్టర్ పోస్టు సేవలను అప్పటి బ్రిటీష్ చక్రవర్తి లార్డ్ డల్హౌసి ప్రవేశపెట్టారు. అప్పటి ఇండియన్ పోస్టాఫీస్ చట్టంతో రిజిస్టర్ పోస్టు సేవలు మొదలయ్యాయి. అంతకు ముందు 1766లో వారెన్ హేస్టింగ్ ఈస్టిండియా కంపెనీ ఆధ్వర్యంలో 'కంపెనీ మెయిల్' ప్రారంభమైంది. దాదాపు 171 సంవత్సరాల పాటు రిజిస్టర్ పోస్టు సేవలందించింది. ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. ముఖ్యంగా లీగల్ నోటీసులు, అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలను వంటివాటిని పంపడానికి ఇది ఎంతగానో ఉపయోగపడింది. పంపించిన వస్తువు, పత్రం అవతలి వారికి చేరినట్టు రశీదు(డెలివరీ ప్రూఫ్) పొందడం దీని ప్రత్యేకత. ఇది చట్టపరంగా కూడా ఎంతో విలువైనది.

ఆధునికీకరించేందుకే..

పోస్టల్ సేవలను మరింత ఆధునికీకరించేందుకు తపాలాశాఖ రిజిస్టర్ పోస్టు విలీనంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దేశీయ పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించడం, పనితీరు (మిగతా 6వ పేజీలో..)

అమ్మో.. మార్చురీ

- శిథిలావస్థలో భవనం
- కనీసం ఫ్రీజర్, విద్యుత్ సదుపాయం లేదు
- ఇదీ ఇచ్ఛాపురం సీహెచ్‌సీ దుస్థితి
- పట్టించుకునే వారేరీ?

7లో

వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

- తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ సత్యనారాయణ

శివారుకు సాగునీరివ్వండి

- గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కోరిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

రూ.కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

- ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

6లో




పదో తరగతి పుస్తకంలో కూర్మారావు రచించిన జానపదకళలు

పది పాఠ్యాంశాల్లో ఉత్తరాంధ్ర జానపద కళలు

- తెలుగువాచకంలో కూర్మారావు రచనలు
- పలాస వాసికి అరుదైన గుర్తింపు

పలాస/ పలాస రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పాఠ్యపుస్తకాల్లో ఉత్తరాంధ్ర జానపద కళలకు రాష్ట్ర ప్రభుత్వం చోటు కల్పించింది. పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన జానపద కథా రచయత, కళాకారుడు, జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు రచనలు కొన్ని సేకరించి.. తెలుగు వాచకంలో ముద్రించింది. కూర్మారావు పరిశోధనలు చేసి 'ఉత్తరాంధ్ర జానపద కళలు' అనే గ్రంథాన్ని పుస్తక రూపంలోకి తీసుకువచ్చారు. వీటిలో తప్పెటగుళ్ల, జముకుల పాట, గిరిజన సంప్రదాయ నృత్యం థింసా వంటి కళల ప్రత్యేకతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వాటిని పదో తరగతి 'తెలుగు పరిమళం' పుస్తకంలో ముద్రించింది. ఉత్తరాంధ్రకు ప్రత్యేకమైన జానపదం తప్పెటగుళ్ల ప్రదర్శన ఎంతో ప్రాచుర్యం పొందింది. దేశవిదేశాల్లో కళాకారుల ప్రదర్శన అనేక మంది ప్రశంసలు అందుకుంది. రంగస్థలం సినిమాలో కూడా దీనికి చోటు కల్పించి ఉత్తరాంధ్ర జానపదాన్ని గుర్తించారు. దీంతోపాటు ప్రాచీనమైన జముకుల పాట, గిరిజన నృత్యం థింసాకు కూడా పాఠ్యాంశంలో చోటుకల్పించడంతో ఉత్తరాంధ్ర కవులు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్ తరాలకు జానపద (మిగతా 6వ పేజీలో..)



గౌరవంగా భావిస్తున్నా..



పదోతరగతి పాఠ్యాంశంలో నా గ్రంథం నుంచి తీసుకున్న జానపద కళలను ప్రచురించడం ఆనందంగా ఉంది. ఇది ఉత్తరాంధ్ర జానపకళలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నాను. ప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ రూపకర్తలకు కృతజ్ఞతలు. భవిష్యత్‌లో కూడా మన జానపదాలకు తగిన స్థానం కల్పించాలి.

- బద్రి కూర్మారావు, ఉత్తరాంధ్ర జానపదకళలు రచయిత

జిల్లా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆవిర్భావ వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళంలో ఈ నెల 13 నుంచి 15 వరకు వజ్రోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి కోడిరామ్మూర్తి స్టేడియంలో ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'వేడుకల నిర్వహణకు సంబంధించి అప్పగించిన బాధ్యతను ఆయా శాఖల అధికారులు సక్రమంగా నిర్వర్తించాలి. నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయాలి. ఆర్ట్స్ కళాశాల, కోడి రామ్మూర్తి స్టేడియంలో సాంస్కృతిక, క్రీడా, ప్రదర్శన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలి' అని ఆదేశించారు.

- 13న ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉదయం 7 గంటలకు రన్ ఫర్ శ్రీకాకుళం నిర్వహిస్తారు. నాగావళి హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇన్వెస్టర్ల సమావేశం నిర్వహిస్తారు. కేఆర్ స్టేడియంలో మూడురోజులపాటు సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్ ప్రదర్శిస్తారు.
- 14న మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. మెన్స్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలు ఉంటాయి.
- 15న ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్ర మంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఆర్డీవో సాయి ప్రత్యూష పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి







శ్రీకాకుళం నగరంలోని సాయిగిరి వద్ద కనిపిస్తున్న దృశ్యం ఇది ఇది. ఇక్కడో విద్యుత్ స్తంభం ఉంది. తీగెలు అల్లుకుని పోవడం వల్ల ఇలా కనిపిస్తోంది.

పొన్నాడ రోడ్డులో విద్యుత్తు వైర్లకు తీగెలు అల్లుకుని ఇలా వేలాడుతున్నాయి.

ఆహ్లాదం కాదు.. అపాయం

ఇదేదో పచ్చని పిరమిడ్ అనుకుంటే పొరబడినట్లే. సాయిగిరి వద్ద విద్యుత్తు టవర్‌కు చుట్టుకున్న తీగెలు ఇవి.

అరసవల్లి/ఎచ్చెర్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నగరం, ఎచ్చెర్ల పోలీసు క్వార్టర్స్ వద్ద విద్యుత్ స్తంభాలకు పిచ్చిమొక్కల తీగెలు చుట్టుకుని ప్రమాదకరంగా మారాయి. హైటెన్షన్, సాధారణ విద్యుత్ స్తంభాలకు కూడా తీగెలు పాకినా పట్టించుకునే నాథుడే లేడు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నగరంలోని సాయిగిరి ప్రాంతంలో ఓ విద్యుత్తు స్తంభం ఏకంగా పిచ్చితీగెల మధ్య చిక్కుకుని కనిపించకుండా పోయింది. ఎచ్చెర్ల సాయుధ పోలీసు క్వార్టర్స్ నుంచి ఎచ్చెర్ల గ్రామానికి వెళ్లే రోడ్డులో విద్యుత్ స్తంభాలకు పొదలు అల్లుకున్నాయి. విద్యుత్ శాఖాధికారులు స్పందించి పిచ్చిమొక్కల తీగెలను తొలగించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రన్నా.. సుఖీభవ

(ఐదో పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో రైతులు అడుగడుగునా దగా పడ్డారు. అన్నదాతకు ఇచ్చిన మాట మేరకు సీఎం చంద్రబాబునాయుడు ధాన్యం కొనుగోలు సమయంలో 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. వరి, అరటి, మామిడి, మొక్కజొన్న సాగు చేసిన రైతులను ఆదుకుంటున్నాం. అన్నదాత సుఖీభవ పథకం అమలుతో రైతుల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, మార్కెట్ కమిటీ చైర్మన్లు పోగోటి ఉమామహేశ్వరి, బలరాం, నరసన్నపేట, చల్లపేట, అల్లాడ, పోలాకి పీఏసీఎస్‌ల అధ్యక్షులు ఇసా అప్పారావు, దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు, బైరి భాస్కరరావు, రాష్ట్రకాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, ఎంవీ నాయుడు, వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, మెండ రాంబాబు, అడపా చంద్రశేఖర్, శిమ్మ లక్ష్మణరావు, చిట్టి సింహాచలం పాల్గొన్నారు.

పది పాఠ్యాంశాల్లో ఉత్తరాంధ్ర జానపద కళలు

(ఐదో పేజీ తరువాయి)

కళలపై అవగాహన పెరిగి మరింత ఆదరణ లభిస్తుందని భావిస్తున్నారు. ముఖ్యంగా అంతరించిపోతున్న జానపదాలను వెలుగులోకి తీసుకువచ్చి గ్రంథంగా మలచిన కూర్మారావును ప్రశంసిస్తున్నారు. ఇదిలా కూర్మారావు ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాంఘిక సంక్షేమశాఖ ఆశ్రమ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. ఆయన తండ్రి బద్రి అప్పన్న పేరుమీద జానపదకళాజాతను ఏటా జనవరి 11న నిర్వహిస్తున్నారు. ఆ రోజు ఉత్తరాంధ్ర జానపదకళాకారులకు సత్కారంతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుంటారు.

రిజిస్టర్ పోస్టుకు సెలవు!

(ఐదో పేజీ తరువాయి)

మెరుగుపరచుకోవడం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటివి విలీన ప్రక్రియకు కారణాలుగా తెలుస్తోంది. స్పీడ్ పోస్టు అనేది వేగవంతమైన డెలివరీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పుడు రిజిస్టర్ పోస్టుల సేవలు స్పీడ్‌పోస్టులో విలీనమైతే.. డెలివరీలు మరింత వేగవంతం అవుతాయి. ముఖ్యంగా స్పీడ్ పోస్టు ద్వారా మీ పార్సిల్ ఎక్కడికి వెళ్లిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే సౌకర్యం సైతం ఉంటుంది. ఈ ఆప్షన్ రిజిస్టర్ పోస్టులో లేదు. అలాగే ఒకే సేవ ఉండడం వల్ల పోస్టల్ సేవలు మరింత సులువవుతాయి. సిబ్బందిపై పనిభారం కూడా తగ్గుతుంది. అయితే ప్రభుత్వ శాఖలే ఎక్కువగా రిజిస్టర్ పోస్టు సేవలను వినియోగించుకునేవి. అన్నిరకాల ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ రిజిస్టర్ పోస్టు ద్వారా చేసేవి. అందుకే ముందుగా పోస్టల్ శాఖ ప్రభుత్వ శాఖలకు ఈ విషయంపై సమాచారం అందించింది. సెప్టెంబరు 1న విలీన ప్రక్రియ ఉండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. కాగా రిజిస్టర్ పోస్టును నిలిపివేస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడ్‌పోస్టులో విలీనం చేస్తే రుసుం పెరుగుతుందని, అదనపు భారం తప్పదని భావిస్తున్నారు. రిజిస్టర్ పోస్టు చార్జీ రూ.26 ఉంటే.. స్పీడ్ పోస్టు చార్జీ రూ.41 వరకూ ఉంటుందని పేర్కొంటున్నారు. స్పీడ్ పోస్టు చార్జీలు తగ్గించాలని కోరుతున్నారు.

వాస్తవమే

స్పీడ్ పోస్టులో రిజిస్టర్ పోస్టు విలీనం వాస్తవమే. సెప్టెంబరు 1 నుంచి ఈ విధానం అమల్లోకి రానున్నట్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం. వినియోగదారులకు మరింత వేగంగా సేవలందిస్తాం.

- షణ్ముఖరావు, ఇన్‌చార్జి పోస్టుమాస్టర్, ఇచ్ఛాపురం



ఎన్నో సౌలభ్యతలుండేవి

రిజిస్టర్ పోస్టు వచ్చిందంటే ఆనంద సమాచారమే. ఎక్కువగా ఉద్యోగాలకు సంబంధించిన అపాయింట్‌మెంట్లు వచ్చేవి. లీగల్ నోటీసులు సైతం రిజిస్టర్ పోస్టుల్లోనే పంపేవారు. ఎన్నో సౌలభ్యతలు సొంతమైన రిజిస్టర్ పోస్టు కనుమరుగవుతుండడం బాధాకరం.

- దాసరి రాజు, ఇచ్ఛాపురం

4 రోజులు ముందే..

(ఐదో పేజీ తరువాయి)

మార్కులు సాధించారు. 80శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఉమ్మడి జిల్లాలో దాదాపు 20 మందికిపైగా ఉన్నారు. 75శాతం నుంచి 80 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. వీరి మధ్య పోటీ తీవ్రంగా ఉంది.

తుది జాబితా ఎంపికకు కసరత్తు

డీఎస్సీలో వచ్చిన మార్కులు ఆధారంగా జిల్లా సెలక్షన్ కమిటీ ఉపాధ్యాయులు ఎంపిక జాబితాను సిద్ధం చేయనుంది. ఈమేరకు విద్యాశాఖ మార్గదర్శికాలను జారీ చేసింది. ఎంపిక కమిటీకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను వివిధ రిజర్వేషన్ల ప్రాతిపదికన ఎంపిక చేస్తారు. దివ్యాంగుల కోటాలో భర్తీ చేయనున్న పోస్టుల్లో సదరంలో ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు ధ్రువీకరించిన తరువాతే వారిని పోస్టులకు ఎంపిక చేయనున్నారు.

- ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో ఎస్జీటీ-113, ఫిజికల్ ఎడ్యుకేషన్ -81, సోషల్-70, బయాలజీ- 34, ఫిజికల్ సైన్సు-14, గణితం-33, ఇంగ్లిషు-65, హిందీ-11, తెలుగు-37 పోస్టులు భర్తీ చేయనున్నారు.
- ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమపాఠశాలలో ఎస్జీటీ -33, సోషల్ -5, బయాలజీ-12, ఫిజికల్ సైన్సు-10, గణితం-13, ఇంగ్లిషు-12 పోస్టులు భర్తీ చేస్తారు.

నెలాఖరు నాటికి నియమాక పత్రాలు

డీఎస్సీలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు ఈనెల 31 నాటికి నియమాక పత్రాలను అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా సెలక్షన్ కమిటీ మంగళవారం సమావేశం కానుంది. జిల్లాలో పూర్తిస్థాయిలో డీఈవో లేరు. ఇన్‌చార్జిలు కొనసాగుతున్నారు. ఉపాధ్యాయులకు నియమాక పత్రాలు ఇవ్వాలంటే పూర్తి అదనపు బాధ్యతలు లేక డీఈవోను నియమించాల్సి ఉంది.

ప్రతిఇంటా జాతీయ జెండా ఎగరాలి

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

నగరంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ





జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలని వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్య క్రమం కొనసాగుతోందన్నారు. నగరంలో సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు జాతీయ పతాక ర్యాలీను కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులు అర్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్-2047 సంకల్పానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశం, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగాలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలన్నారు. జాతీయ పతాకాన్ని ఇంటిపై ఎగురవేయడంతో పాటు సెల్ఫీ పాయింట్ల వద్ద జెండాతో ఫొటోలు తీసి సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ర్యాలీలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, పలు కళాశాలల విద్యార్థులు, యువకులు, అధికారులు పాల్గొన్నారు.

ట్రంప్ ప్రభావం అన్ని దేశాలపై పడింది

ట్రంప్ ప్రభావం అన్ని దేశాలపై పడిందని మంత్రి అన్నారు. ఆక్వారంగ అభివృద్ధికి నిపుణుల అభిప్రాయం తీసుకుంటామన్నారు. ఈ నెల 12న ఆక్వారంగం పరిస్థితులపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అనాథ పిల్లల దత్తతకు 'ఫోస్టర్ కేర్'

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు కుటుంబ సంరక్షణ, శాశ్వత పెంపకం కోసం అందించే విధానమే ఫోస్టర్ కేర్ అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ మేరకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత శాఖ 'మిషన్ వాత్సల్య'లో భాగంగా సోమ వారం జడ్పీ సమావేశ మందిరంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. తల్లిదండ్రులు లేని లేదా సంరక్షణ అవసరమైన పిల్లల దత్తతకు ఉద్దేశించిందే ఈ విధానమన్నారు. ఇటువంటి పిల్లలకు ఆశ్రయం కల్పించి, వారికి ప్రేమ, ఆప్యాయత, భద్రత ఇవ్వవచ్చన్నారు. ఇది పిల్లల అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు.

దత్తత విధానం ఇలా..

ఫోస్టర్ కేర్ విధానంలో కనీసం రెండేళ్లపాటు పెంచిన పిల్లలను నిర్దేశిత, ప్రభుత్వ నిబంధన లు, మార్గదర్శకాలకు అనుగుణంగా శాశ్వతంగా దత్తత తీసుకోవచ్చు. భారతీయులైన దంపతు లు, ఒంటరి మహిళ/పురుషులు, ఆరోగ్యవంతులైన వారు, ఎటువంటి దీర్ఘకాలిక వ్యాధులు, ప్రాణాపాయ రుగ్మతలు, నేరచరిత్ర లేనివారు అర్హులు.

అవసరమైన పత్రాలివీ..

అనాథలను దత్తత తీసుకోవాలనుకునే వారు వారి కుటుంబ ఫొటో, ఆధార్, పాన్, జనన, ఆరోగ్య, నివాస, ఆదాయ, వివాహ ధ్రువపత్రాలు, ఇద్దరు బంధువుల సిఫారసు లేఖలు అందించాల్సి ఉంటుంది. అనాథ శిశువులను ముళ్ల పొదలు, చెత్త కుప్పల్లో వదిలివేయకుండా వెంటనే బాలల సంరక్షణా విభాగానికి లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారం కోసం జిల్లా బాలల రక్షణ అధికారి 7901597211, రక్షణాధికారి 9849530982 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, జయదేవి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు సకాలంలో పరిష్కరిస్తాం

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న చైర్మన్‌సత్యనారాయణ

పలాస, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి బి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద వినియోగదారుల పరిష్కార వేదిక సోమవారం మధ్యాహ్నం నిర్వహించారు. పలాస ప్రాంతం నుంచి 11 మంది తమ సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ ఫిర్యాదులను రెండు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. 2005 నుంచి ఇప్పటి వరకూ 9,082 ఫిర్యాదులు రాగా 8,844 పరిష్కరించామని చెప్పారు. 111 మంది వినియోగదారులకు విద్యుత్‌శాఖ నుంచి రూ.14.59 లక్షల పరిహారాన్ని అందించామన్నారు. సమస్యలుంటే వాట్సాప్ నెంబర్ 94400 14734కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వినియోగదారులకు పూర్తి న్యాయం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోందన్నారు. అనంతరం ఫిర్యాదుదారులతో సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.సుబ్బారావు, ఈఈ జి.యజ్ఞేశ్వరరావు, ఏడీఈ కృష్ణమూర్తి, ఏఏఓ కె.భాస్కరరావు, ఏఈలు వివేకానంద, నాగభూషణరావు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధం



నందిగాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే చేపట్టిన గ్రామాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధమవుతున్నాయి. మండలంలో మొదటివిడత సర్వే పూర్తయిన 23 గ్రామాలకు సంబంధించి 4,541 పట్టాదారు పాసుపుస్తకాలు తహసీల్దారు కార్యాలయానికి చేరాయి. ఉపతహశీల్దార్ వి.శంకరరావు, రీసర్వే ఉపతహశీల్దార్ ఆర్.రామారావు పర్యవేక్షణలో వీఆర్‌వోలు పుస్తకాలను సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి పట్టాదారు పాసుపుస్తకాలను ప్రభుత్వం అందించనుంది. ప్రభుత్వ పెద్దల ఫొటోలు లేకుండా ప్రభుత్వ రాజముద్రతో ఈ పుస్తకాలు ఉన్నాయి.

శివారుకు సాగునీరివ్వండి

- గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కోరిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

శ్రీకాకుళం కలెక్టరేట్/పలాస, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పలాస, వజ్రపుకొత్తూరులోని శివారు భూములకు వంశధార నీరందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రైతులతో కలిసి సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినపతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నెల రోజులుగా నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. నరసన్నపేట, టెక్కలిలో నీటిని ఆపేసి దిగువన ఉన్న పలాస నియోజకవర్గంలో భూములకు నీరు అందకుండా చేశారన్నారు. ప్రత్యేకించి నరసన్నపేట నియోజకవర్గంలో రాత్రివేళల్లో మళ్లీ మళ్లీ నీటిని వినియోగించడం వల్ల పలాసకు అందడం లేదని గుర్తు చేశారు. సదరు ఎమ్మెల్యే తమ ప్రాంత భూములకు నీరందేలా సహకరించాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత ఎస్ఈతో మాట్లాడామని, ఈ నెల 12 నుంచి ఇస్తామన్నారని తెలిపారు. ఇదే విషయమై కలెక్టర్ కూడా భరోసా ఇచ్చారన్నారు. 10 రోజుల పాటు నీరందిస్తే తమ ప్రాంత రైతులకు సరిపోతుందన్నారు.



గ్రీవెన్స్‌లో సోమవారం తన నియోజక వర్గంలోని సాగు నీటి సమస్యలు, రైతుల ఇబ్బందులను వివరిస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

రూ.కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు విన్నపం

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం బలగ రెవెన్యూ పరిధిలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని బోనెల చిరంజీవి అనే వ్యక్తి సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. శ్రీకాకుళం - ఆముదాలవలస ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న 1.80 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచెవేసి కబ్జా చేశారని, ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు కూడా యత్నిస్తున్నారని అన్నారు. రోడ్డు విస్తరణ సందర్భంగా సర్వే చేసినప్పుడు అది ప్రభుత్వ భూమిగా తేలిందన్నారు. 2023లో అదే భూమిని జిరాయితీగా చూపించి కొందరు స్థానిక రాజకీయ నాయకుల అండతో అక్రమార్కులు కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠ్కర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారని, అది ప్రభుత్వ భూమి అని నిర్ధారించి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ఆ బోర్డులను కూడా రాత్రివేళల్లో అక్రమార్కులు తొలగించారని, స్థలం చుట్టూ కిరాయి మూకలతో కంచె వేయించారని తెలిపారు. ఇప్పుడు అదే భూమిలో నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

నాగావళి రివర్ వ్యూ పార్కు ఆధునికీకరణ

● ఎమ్మెల్యే గొండు శంకర్



పార్కు పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగావళి రివర్ వ్యూ పార్కును ఆధునికీకరిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం స్థానిక శాంతినగర్ కాలనీలోని రివర్ వ్యూ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు అందరినీ ఆకట్టుకునేలా ఆహ్లాదకరంగా పార్కును తీర్చిదిద్దుతామన్నారు. దోబీ ఘాట్ పక్కన జవాన్ పార్కును కూడా అభివృద్ధి చేస్తామని, ఇప్పటికే ఈ విషయమై కలెక్టర్‌తో చర్చించామన్నారు. కార్యక్రమంలో రజక సంఘ డైరెక్టర్ దుర్గారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ఆరో అదనపు న్యాయాధికారి కె.కిశోర్‌బాబు

సోంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జిల్లా ఆరో అదనపు న్యాయాధికారి కె.కిశోర్‌బాబు కోరారు. కోర్టు ప్రాంగణంలో బార్ అసోసి యేషన్ సభ్యులు, పోలీసులు, న్యాయ వాదులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఇరు పక్షాలను ఒప్పించి రాజీ చేయించు కోవాలని కోరారు. సమావేశంలో సీనియర్, జూనియర్ సివిల్ న్యాయాధికారులు జె.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ శైలేంద్ర, డీఎస్పీ వెంకటప్పారావు, సీఐ లవరాజు తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యలను పరిష్కరించాలి



జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నేతలు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి, బుడతవలస గ్రామాల దళితుల భూ సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరావు సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కోటబొమ్మాళికి చెందిన 12 మంది దళితులకు 1976లో ప్రభుత్వం డి-పట్టాలు మంజూరు చేసిందని, నాటి నుంచి ఇప్పటి వరకు ఈ భూములను వారే సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే ప్రస్తుతం మూలపేటకు పోర్టు వచ్చిన తరువాత భూముల రేట్లు విపరీతంగా పెరగడంతో కొందరు వ్యాపారులు రియల్ ఎస్టేట్ దందాకు తెరతీశారన్నారు. దీంతో అధికారులు సదరు భూమిని గెడ్డ పోరంబోకుగా చెప్పడం అన్యాయమన్నారు. గత ఏడాది రైతు భరోసా పడిందని, ఈ ఏడాది ఎందుకు పడలేదని ప్రశ్నించారు. అలాగే లావేరు మండలం బుడతవలసలో కూడా దళితులకు ఆరు ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టాలు మంజూరు చేసింది. దళితులు నీలగిరి తోట వేసుకుని జీవనం సాగిస్తుంటే, కొందరు పెత్తందారులు, ఆ భూమిలోని నీలగిరి తోటను దౌర్జన్యంగా నరికి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణం బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు దేవాది ఉమామహేశ్వరరావు, కుప్పిలి రాజారావు, కుప్పిలి మురళి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదీ మా వీధి రోడ్డు

● మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నాం

● గ్రీవెన్స్‌లో డీసీసీబీ కాలనీ వాసుల వినతి



డీసీసీబీ కాలనీ రోడ్డుపై నిలిచి ఉన్న మురుగునీరు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మా వీధి మెయిన్ రోడ్డంతా మురుగు నీటితో నిండిపోయి దారుణంగా తయారైంది. నడిచి వెళ్లేందుకు కూడా వీలుకాని పరిస్థితి ఎదురవుతోంది. తక్షణం స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని నగరంలోని డీసీసీబీ కాలనీ వాసులు వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మురుగునీటితో దుర్గంధంతో పాటు దోమలతో రోగాలబారిన పడుతున్నామని, ఓ ప్రైవేటు కళాశాల నుంచి మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో డీసీసీబీ కాలనీ, షిర్డీ సాయినగర్‌కి చెందిన కేఈఎస్ఎన్‌పాత్రో తదితరులున్నారు.

డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (సీఎస్) ఆనర్స్ కోర్సు

ఆమదాలవలస, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ (సీఎస్) ఆనర్స్ కోర్సు ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో ఆరు కోర్సులు ప్రారంభిస్తున్నామన్నారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఆనర్స్, బీఎస్సీ మేథమెటిక్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బోటనీ, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులను ప్రారంభిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రైవేటు కళాశాలల సమస్యలపై ధర్నా రేపు

ఎచ్చెర్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రెండేళ్లకు సంబంధించి బోధనా రుసుం (ఫీజు రీయింబర్స్‌మెంట్) విడుదల చేయాలని కోరుతూ బుధవారం తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నాన జయరాం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆగస్టు వచ్చినా డిగ్రీ అడ్మిషన్, సిలబస్‌పై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు.

క్రీడా ఎంపికకు స్పందన కరువు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కోడిరామ్మూర్తి స్టేడియంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా ఎంపికలకు స్పందన కరవైంది. పది క్రీడాంశాల్లో జరిగిన ఎంపికలకు తక్కువ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, పాత్రునివలస ఎంసీఎస్‌సీ మైదానంలో హాకీ పోటీలు నిర్వహించారు. స్టేడియంలో అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాక్సింగ్ ఎంపికలు, బాస్కెట్‌బాల్ ఎంపికలు ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో నిర్వహించారు. వెయిట్ లిఫ్టింగ్ ఎంపికల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14న విశాఖపట్నంలో జరగనున్న జోనల్‌స్థాయి ఎంపికల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డా.కె.శ్రీధర్ తెలిపారు.

అమ్మో.. మార్చురీ

● శిథిలావస్థలో భవనం

● కనీసం ఫ్రీజర్, విద్యుత్ సదుపాయం లేదు

● ఇదీ ఇచ్ఛాపురం సీహెచ్‌సీ దుస్థితి

● పట్టించుకునే వారేరీ?



సీహెచ్‌సీ మార్చురీ భవనం (ఇన్‌సెట్‌లో) లోపలి భాగం దుస్థితి..

ఇచ్ఛాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఇరు రాష్ట్రాలకు సరిహద్దు పట్టణం.. అటు ఒడిశా, ఇటు రాష్ట్రంలో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రమాదాల్లో మృతులు ఎక్కువగానే ఉంటుంటారు. వారికి పోస్టు మార్టం చేసేందుకు మృతదేహాలు ఇచ్ఛాపురం సీహెచ్‌సీలోని మార్చురీకి తీసుకు వస్తారు. అయితే ఇక్కడి పరిస్థితి చూస్తే మార్చురీ ఇంత దారుణంగా ఉంటుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం నేడు శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. భారీ వృక్షాలు సైతం భవనం గోడలపై మొలవడంతో పెచ్చులూడి తరచూ పడుతున్నాయి. అయితే దీనిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మృతదేహాన్ని ఉంచేందుకు ఫ్రీజర్ బాక్సు గాని, కనీసం విద్యుత్ సదుపాయం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో మృతదేహాలను మార్చురీలోని దిమ్మెలపైనే ఉంచుతున్నారు. ఈ ఆసుపత్రికి ఇరు పక్కలా సుమారు 25 కిలోమీటర్లలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం తీసుకువస్తుంటారు. సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించిన భవనాన్ని ఆ తరువాత పట్టించుకోకపోవడం, కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సీహెచ్‌సీకి నూతన భవనాలు నిర్మాణం చేపట్టినప్పటికీ మార్చురీ విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంతో మృతదేహాల పోస్టు మార్టం కోసం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెలలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక లారీ డ్రైవర్ చెరువులో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచి తరువాత పోస్టమార్టం కోసం ఇచ్ఛాపురం సీహెచ్‌సీ మార్చురీకి తీసుకొచ్చారు. భవనం స్లాబ్ ముక్కలుగా కింద పడిపోతుండడంతో శవాన్ని ఉంచేందుకు కూడా ఇబ్బందులు పడ్డామని ఆయన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం పీఎం రూమ్‌లో ఫ్రీజర్‌తో పెడ తామంటే అక్కడ విద్యుత్ ప్లగ్ పాయింట్ లేకపోయిందని, దీంతో బయటకు తీసుకురావాల్సిన పరిస్థితి ఎదురైందని బొండాడ మహేష్ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మార్చురీ గది నిర్మాణంతో పాటు ఆధునిక సదుపాయాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూప రింటెండెంట్ డా.పి.దేవేంద్ర రెడ్డి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా మార్చురీ శిథిలావస్థకు చేరుకున్న విషయం వాస్తవమని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లా మన్నారు. తగు చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



ఆమదాలవలస, పొందూరుల్లో సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నేత కార్మికులు, టీడీపీ నేతలు



ఆమదాలవలస, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసాచార్యులపేట, అక్కులపేట గ్రామాల్లో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శ్రీసీతారామ చేనేత సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి చేనేత కార్మికులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు మాట్లాడుతూ నేత కార్మికుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు మగ్గాలకు ఉచిత విద్యుత్, చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపు, నేతన్న భరోసా కింద ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, ఎంపీటీసీలు బొడ్డేపల్లి సుగుణ, అన్నెపు భాస్కరరావు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నేతన్నల సంక్షేమ ప్రదాత సీఎం చంద్రబాబు

పొందూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చేనేతరంగం అభివృద్ధి నేతన్న సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు నేతన్నల సంక్షేమ ప్రదాత అని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ అన్నారు. నేతన్నలకు ఏడాదికి రూ.25 వేలు, నేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి సోమవారం చేనేత కార్మికులు పాలభిషేకం చేశారు. తోలాపిలోనూ చేనేత కార్మికులు, నాయకులు సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలభిషేకం చేసి తమ ఆనందం వ్యక్తంచేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బలగ శంకరభాస్కర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగ, వీఏసీఎస్ అధ్యక్షుడు వండాన మురళి, చేనేత సొసైటీ మాజీ అధ్య క్షుడు కాలెపు శ్రీనివాసరావు, అనెం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

కంచిలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఓటు దోపిడీపై నిలదీసేందుకు ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇండియా కూటమి నేతలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని జిల్లా యువ జన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనతో ఓటు దోపిడీ నిజమని దేశ ప్రజలందరికీ తెలిసిందని వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ పోరాటం కాదని, ప్రతీ ఒక వ్యక్తి ఓటు హక్కును కాపాడే పోరాటమన్నారు.

భైరిదేశి కాలువకు నీరు



గార రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భైరిదేశి కాలువలకు వంశధార ప్రాజెక్టు అధికారులు నీటిని విడిచిపెట్టారు. ఖరీఫ్ నాట్ల సమయంలో కాలువల్లో నీరు రాకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఆదిలోనే సాగునీటి కష్టాలు' శీర్షికతో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వంశధార అధికారులు నీరు విడిచిపెట్టగా సోమవారం కాలువలోకి చేరింది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేశారు.

మునిసిపల్ మాజీ చైర్మన్ పోలారావుకు నివాళి

ఇచ్ఛాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మునిసిపల్ మాజీ చైర్మన్ పిలక పోలారావు వర్ధంతి సందర్భంగా సోమవారం ఘన నివాళి అర్పించారు. బెల్లుపడ వద్ద పోలారావు విగ్రహానికి వైసీపీ ఎమ్మెల్సీ నర్తు రామారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇచ్ఛాపురం మునిసిపాలిటీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, ఆశి లీలా రాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, 3వ వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య, నీలాపు లక్ష్మి, పిలక సంతు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీ చట్టంపై అవగాహన

గార, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వాహనాలను అతివేగంగా నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీహెచ్ గంగరాజు అన్నారు. సోమవారం గార మూడు రోడ్ల కూడలి వద్ద వాహనాలను పరిశీలించి ఎంవీ చట్టంపై అవగాహన కలిగించారు.

కళావేదిక ప్రారంభం

కవిటి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డి.గొనప పుట్టుగ గ్రామంలోని సిద్ధి వినాయక కళావేదికను సోమవారం జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ, ఎమ్మెల్సీ ఎన్.రామారావు ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో ప్రతిభ యువజన సంఘం సహకారంతో దీనిని నిర్మించారు. సర్పంచ్ బి.కిరణ్‌కుమారి, ఎంపీటీసీ పూర్ణచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకూడదు



అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా గ్రీవెన్స్‌లో స్వీకరిస్తున్న వినతులు పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 43 మంది నుంచి వినతులను స్వీకరించి వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సమస్యలపై చట్ట ప్రకారం విచారణ చేసి సత్వర న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. ఆయా పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, మోసపూరితమైన, ఆస్తి తగాదాలు, కొట్లాట, ఇతర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు.

కిక్ బాక్సింగ్‌లో కీర్తన ప్రతిభ



చిన్నారి కీర్తనను అభినందిస్తున్న కలెక్టర్

పొందూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాపాక గ్రామానికి చెందిన ఎచ్చర్ల కీర్తన కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచింది. ఆదివారం విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ బాక్సింగ్ హాల్‌లో హెచ్‌సీజీ కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొంది. ఈ పోటీలో అండర్-10 బాలికల విభాగంలో కీర్తన పాల్గొని రెండో స్థానం సంపాదించింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చిన్నారిని అభినందించారు.

నడక పోటీలో విజేత శృతి



కవిటి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలో నడకపోటీలో చిన్నమెళియా పుట్టుగకు చెందిన ఎం.శృతి విజేతగా నిలిచింది. గుంటూరు జిల్లా బాపట్ల లో ఈ పోటీలు నిర్వహించారు. పది కిలో మీటర్లు (10వేల మీటర్లు) నడకలో శృతి పాల్గొని మొదటి స్థానంలో నిలిచింది. ఆమెకు నిర్వాహకులు మెడల్ అందించి అభినందించారు.

న్యూస్ బాక్స్

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒకటి నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐలు, పాలిటెక్నిక్, నర్సింగ్, డిగ్రీ కళాశాలల్లో ఈ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే ఈ మాత్రలు వేసుకోని వారి కోసం ఈనెల 20న మాపప్ డే రోజున మాత్రలు వేసుకోవాలని కోరారు. ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో ప్రగతి సాధించగలమన్నారు. నులిపురుగుల నివారణ వల్ల పిల్లల్లో మానసిక, శారీరక వికాసం కలుగుతుందని, తల్లిదండ్రులు పిల్లలతో ఈ మాత్రలు వేయించాలని కోరారు.

30న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఈదుపురం బేతాళ యువజన సంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 30న గ్రామంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వా హకులు ఒక ప్రకటనలో తెలిపారు. క్విజ్ పోటీల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులు ఒక్కో పాఠశాల నుంచి ఒక టీం మాత్రమే పాల్గొనాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 90000 45663, 93985 33123 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కవిటి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాణికేశ్వరి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను అందజేశారు.
● కుసుంపురం మోడల్ ప్రైమరీ పాఠశాలకు సోమవారం గ్రామస్థులు దానయ్య, దేవిక, రాజారావు, డిల్లేశ్వరి దంపతులు మైక్‌సెట్‌ను అందించారు. రూ.15 వేలు విలువైన మైక్‌సెట్‌ను హెచ్‌ఎం ఎస్.రాజబాబుకు అందజేశారు.

సామాజిక బాధ్యతతో పనిచేయండి

వైద్యాధికారులు, సిబ్బందికి మంత్రి అచ్చెన్న ఆదేశం ● జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రిలో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వైద్యులు సామాజిక బాధ్యతతో పని చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. వైద్యులు, వైద్య సిబ్బంది కొరత, రోగులకు సేవలు అంతరాయం తదితర అంశాలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనాలపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేశారు. రెండున్నర గంటల పాటు ఆస్పత్రిలో అణువణువూ తిరుగుతూ..సమస్యలపై ఆరా తీశారు. 'ఆసుపత్రిలో పారిశుధ్యం మెరుగ్గా కనిపించింది. మిగిలిన విభాగాల్లో మరింత మార్పులు రావాల్సి ఉంది. మీరు సమయపాలన పాటించడం, మీలో మార్పు రావడం తప్పనిసరి. ఆర్థోపెడిక్ విభాగంపై ఫిర్యాదులు వస్తు న్నాయి. వీటిని చెక్ చేసుకోవాల్సిన బాధ్యత సూపరెంటెండెంట్‌పై ఉంది. డాక్టర్ మహరాజ్ రోగులపై ఎక్కువగా చిరాకు పడుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. ఇక నుంచి అలా రాకుండా చూసుకోండి. వైద్యులు, సిబ్బంది మొక్కుబడిగా వైద్యం చేయకండి. సామాజిక బాధ్యతగా విధులు నిర్వహించండి. ఫ్యాన్లు నెమ్మదిగా తిరుగుతున్నాయి. కొన్నిచోట్ల లైట్లు వెలగడం లేదు. ఇవి కూడా మీరు గమనించరా? రోగులకు సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అనేది పరిశీలించండి' అని సూపరెంటెండెంట్ సూర్యారావును ఆదేశించారు. మార్చురీ గది పనులు సెప్టెంబరు 15 నాటికి పూర్తి కావాలని స్పష్టం చేశారు. కొత్తగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా స్తంభాలు వేసి.. విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఏఈఈ మురళీకృష్ణను ఆదేశించారు. తన బిడ్డకు కుక్క కాటు మందు వేయించాలని వెళితే వైద్యుడు మహరాజ్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా తనపై కేసు పెట్టారని కె.అజిత్‌కుమార్ మంత్రికి తెలిపారు. ఆస్పత్రిలో అంబులెన్స్ లేదని కొంతమంది తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ..ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమయ పాలన ఏదీ?

ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి చేరుకున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సిబ్బంది రాకపోకలను పరిశీలించారు. ఎక్కువ మంది సిబ్బంది సమయపాలన పాటించడం లేదని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఇక నుంచి సమయపాలన పాటించాలని... లేదంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మంత్రి వెంట ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, మామిడి రాము, లవకుమార్, కామేసు, కింగ్, ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్ తదితరులు ఉన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

టెక్కలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీలో అనుమతి లేకుండా ఎవరైనా ఇళ్ల నిర్మాణాలు చేపడితే నోటీసులు జారీచేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పంచాయతీ కార్యదర్శి ఏవీ శ్రీనివాసరావుకు సూచించారు. సోమవారం మేజర్ పంచాయతీ కార్యాలయంలో వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలో 58 షాపులు ఉన్నాయని, వీటికి గత 20ఏళ్లుగా అద్దెలు చెల్లించడం లేదని మంత్రి దృష్టికి ఈవో తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి డీఎల్‌పీవో ఐవీ రమణతో మాట్లాడారు. మొత్తం దుకాణాలకు నెలవారీ అద్దెలు వసూలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటిపన్నులు పక్కాగా వసూలు చేయాలన్నారు. పంచాయతీలో విద్యుత్ వెలుగులు ఉండేలా చూడాలని... పారిశుధ్య చర్యలు చేపట్టాలని... ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని సూచించారు. అనంతరం టెక్కలి నియోజకవర్గ వసతిగృహ సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, బగాది శేషగిరి, మామిడి రాము, చాపర గణపతి, పురుషోత్తం, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటుసారా తాగి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పలాస, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 3వ వార్డు పెంటిభద్ర గిరిజన గ్రామ రహదారిలో నాటుసారా తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు సమీప గిరిజన గ్రామంలో నాటుసారా తాగి రోడ్డుపై వస్తుండగా.. ఒకరు కుంకుమ సాగరం చెరువు వద్ద పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పోలీసులు కూడా ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఒకరు వెళ్లిపోగా మిగిలిన వ్యక్తి ఉదయానికి మృతిచెందినట్లు గ్రామస్థులు గుర్తించారు. మృతుడు పడి ఉన్న ప్రాంతంలో వాడేసిన నాటు సారా ప్యాకెట్లు లభించాయి. సంఘటన స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతుడు చెత్తను సేకరించే వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

భూ వివాదంతో వ్యక్తిపై దాడి



గాయపడిన రాజారావు

గార రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భూవివాదం, పాత కక్షల కారణంగా ఒక వ్యక్తిపై కత్తులు, కర్రలతో దాడి చేసిన ఘటన సోమవారం నిజామాబాద్ గ్రామంలో చోటు చేసుకుంది. గార పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ గ్రామానికి చెందిన భగత రాజారావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కళా వరాలు, ఆయన కుమారుడు కళా శేఖర్‌తో పాటు గుర్తుతెలియని మరో ఇద్దరు దాడి చేసి గాయపరిచారు. తెల్లవారు జామున సతివాడ శివాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో దాడి చేసినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన రాజారావు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



నిందితులతో పోలీసులు

టెక్కలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బాపారెడ్డి కాలనీ వద్ద ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద తొమ్మిది కేజీల గంజాయి ప్యాకెట్లను పట్టుకున్నట్లు సీఐ ఎ.విజయ్ కుమార్ సోమవారం రాత్రి విలేకరులకు తెలిపారు. బిషాల్ కేసరీ సామాల్, మునాలిమా అనే ఇద్దరు వ్యక్తులు బ్యాగుల్లో గంజాయి పట్టుకొని వస్తుండగా వారిని పట్టుకున్నామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కొరాపుట్‌కు చెందిన ముఖేష్‌బాగ్ గుణుపూర్ నుంచి గంజాయి ప్యాకెట్లను విశాఖకు రైలు, బస్సుల్లో అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ కేసుకు సంబంధించి గోవాకు చెందిన వినయ్ బాలచంద్రని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

కొత్తూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం మాతల వద్ద గంజాయితో ఒకరు పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తోంది. ఒడిశా నుంచి ఆంధ్రా వైపు సోమవారం గంజాయిని తరలిస్తుండగా మాతల వద్ద కొత్తూరు పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. మంగళవారం పోలీసులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించనున్నట్టు తెలుస్తోంది.

18 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కొత్తూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం మెట్టూరు వద్ద టీ స్టాల్ వద్ద 18 మద్యం సీసాలతో ఒకరిని అరెస్టు చేసినట్లు కొత్తూరు ఎస్.ఐ. ఎమ్‌డీ అమీర్ అలీ తెలిపారు. మెట్టూరు గ్రామానికి చెందిన సనపల తిరుపతిరావు మద్యం సీసాలు తరలిస్తుండగా సోమవారం సాయంత్రం పట్టుకొని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

బలదలో టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

కొత్తూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం బలదలో సోమవారం శ్రీకాకుళం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు రెండు బెల్ట్‌షాపులపై దాడి చేసి 33 ఒడిశా మద్యం సీసాలను స్వాధీనం చేసుకునాన్నారు. పట్టుకొని పోగోటి సూర్యనారాయణ, పట్నాన యోగేశ్వరరావులపై కేసు నమోదు చేసినట్లు కొత్తూరు ఎక్సైజ్ సీఐ కిరణ్మయిాశ్వరి తెలిపారు. శ్రీకాకుళం ఎక్సైజ్ అధికారి అప్పారావు ఆధ్వర్యంలో దాడులు చేసి పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు వివరించారు.

వ్యక్తికి నెల రోజుల జైలు

రణస్థలం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంటుపల్లికి చెందిన మన్నె శ్యామ్‌కుమార్‌కు 30 రోజుల జైలు శిక్ష విధిస్తూ శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 10న రాత్రి మన్నె శ్యామ్‌కుమార్ బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి.. ప్రజలకు ఇబ్బంది పెట్టాడు. అదే రోజు రాత్రి జేఆర్‌పురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విధుల్లో ఉన్న కొంతమంది సిబ్బందితో ఇబ్బందికరంగా ప్రవర్తించాడని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద సోమవారం హాజరుపరిచామన్నారు. ఆయనకు 30 రోజుల జైలు శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు స్వాధీనం

లావేరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బుడుమూరు నుంచి రణస్థలం వైపు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 10 ఆవులను సోమవారం లావేరు పోలీసులు పట్టుకున్నారు. బుడుమూరు సంత జంక్షన్ వద్ద గల జాతీయ రహదారిపై వీటిని పట్టుకొని... తరలిస్తున్న నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు

లావేరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మురపాక వద్దగల తోటలో సోమవారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని...రూ5,350 నగదును స్వాధీనం చేసుకున్నట్టు లావేరు పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి... దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

రణస్థలం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రోడ్డులోని గిరివానిపాలెం జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తులం బంగారు గొలుసును చోరీ చేశారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు... నెల్లిమర్ల రిమ్స్‌లో వైద్యవిద్యనభ్యసిస్తున్న శ్రీజ సోమవారం ఉదయం కాలేజీకి బైక్‌పై వెళ్తుండగా... గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని గొలుసును తెంపుకొని పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

'మీకోసం'.. మేం రాలేం!



ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

మెళియాపుట్టి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక (మీకోసం)ను నిర్వహిస్తోంది. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. ఉదయం 11.30 గంటల వరకు మండల స్థాయి అధికారులు లేక.. కుర్చీలు ఖాళీగా కనిపించాయి. తహసీల్దారు పాపారావు, డీటీ రాము తప్ప మిగతా వారు కనిపించలేదు. దీంతో అర్జీదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అయినా ఎవరూ రాకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ప్రతి వారం ఇక్కడ ఇదే పరిస్థితి ఉంటున్నా.. ఉన్నతాధికారులు ఇక్కడి అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా 'మీకోసం' కార్యక్రమం వల్ల ఉపయోగం లేకుండా పోతోంది.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి

కోటబొమ్మాళి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ అన్నారు. సోమవారం తిలారు గ్రామంలో శిమ్మినాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 270 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 30 మందికి శస్త్రచికిత్స చేయాల్సి ఉందని గుర్తించారు. వారికి విశాఖపట్నంలో ని తమ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందించనున్నట్టు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మృతిచెందిన వ్యక్తుల కుటుంబాలను ఎమ్మెల్యే గౌతుశిరీష సోమవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నువ్వలరేవు సర్పంచ్ పూర్ణ తల్లి మృతిచెందిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల భావనపాడు తీరంలో సముద్ర స్నానాలకు వెళ్లి ప్రమాదంలో మృతిచెందిన పూడిజగన్నాథపురానికి చెందిన జస్వంత్ కుటుంబాన్ని, పాతటెక్కలి పంచాయితీ మడేవానిపేట గ్రామానికి చెందిన దున్న దుర్యోధన, హంకుంపేటలో ఓ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెతో పాటు నాయకులు సూరాడ మోహనరావు, మాజీ ఎంపీపీ గొరకల వసంతస్వామి, పుచ్చ ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

నరసన్నపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బహుళ జాతి కంపెనీల్లో పనిచేసేందుకు ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లమో తదితర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు నేరుగా జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. 11 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని వివరించారు.

బంగారు కుటుంబాల గుర్తింపు

కొత్తూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని 43 పంచాయతీల్లో 2,771 బంగారు కుటుంబాలకు గాను 8,258 మందిని గుర్తించినట్లు ఎంపీడీవో వి.నీరజ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 15న ప్రారంభించనున్న పి-4 పథకానికి ఇప్పటికే గ్రామాల్లో సచివాలయ సిబ్బంది నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఆమె తెలిపారు.

శ్రీరామ కాలనీకి తాగునీటి సౌకర్యం

టెక్కలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ శ్రీరామ కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పంచాయతీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. చాలా కాలంగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీరామ కాలనీకి సోమవారం ఈవో శ్రీనివాసరావు నేతృత్వంలో పైపులైన్లు వేశారు. తాగునీరు అందించేందు పనులకు శ్రీకారం చుట్టారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా రోణంకి

టెక్కలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): టెక్కలి తాలుకా రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘ అధ్యక్షులుగా రోణంకి రామచంద్రరావు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా బి.మోహనరావు వ్యవహరించారు. ఉపాధ్యక్షులుగా రెయ్యి పున్నయ్య, కార్యదర్శిగా కె.ధనుంజయరావు, కోశాధికారిగా అయ్యబాబు, గౌరవాధ్యక్షులుగా ఎం.లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారుగా జీవీ రెడ్డి, ఉపాధ్యక్షులుగా వైకుంఠరావు, వీరస్వామి, డీపీ స్టాలిన్, కుప్పిలి కామేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా నాగభూషణరావు, చిట్టెన్న తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

చిల్లర వర్తకులను ఆదుకోవాలి

టెక్కలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తమను ఆదుకోవాలని చిల్లర వర్తకులు కోరారు. దశాబ్దాలుగా గాంధీ మార్కెట్‌లో చిల్లర వర్తకం చేసుకుంటున్నామని, తమ వల్ల ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేవని తెలిపారు. ఇప్పటికిప్పుడు ఖాళీ చేయాలని అధికారులు చెప్పడం తగదన్నారు. తమకు న్యాయం చేయాలని చిల్లర వర్తకులు ఆర్.కృష్ణవేణి, డి.శోభ, సరోజిని తదితరులు సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

పాఠశాలలను సందర్శించిన ఆర్‌బీఎస్ బృందం



గంటపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

పోలాకి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్రీయ బాలల సంరక్షణ బృంద సభ్యులు సోమవారం సందర్శించారు. ఆర్.బి.ఎస్. జిల్లా ప్రోగ్రాం అధికారి వెంకట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఇటీవల చేపట్టిన నులిపురుగుల నివారణ మందుల వాడకం, ఐరన్ టాబ్లెట్ల వినియోగంపై ఆరా తీశారు. గంటపేట, రుంకుజగన్నాథపురంలోని అంగన్‌వాడీ, పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వీరి వెంట వెంట వైద్యాధికారి శ్రీనాథ్, విస్తరణాధికారి నల్లిరవికుమార్, లక్ష్మి, శేఖర్‌బాబు, మోహిని ఉన్నారు.

రాహుల్‌గాంధీ అరెస్టు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న డాక్టర్ కిల్లి కృపారాణి

టెక్కలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికల కమిషన్‌ను ప్రధాని మోదీ తన గుప్పెట్లో ఉంచుకున్నారని... ఇదేమని ప్రశ్నించిన పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. సోమవారం ఆమె స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేతలను అరెస్ట్ చేయడం తగదన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారని అన్నారు. బీహార్‌లో మోదీ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడు తోందని ఆమె ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో న్యాయస్థానాలు చొరవచూపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 4 కోట్ల72 లక్షల ఓట్ల చోరీ మూలంగా 72 పార్లమెంట్ స్థానాలు తారుమారయ్యాయని ఆరోపించారు. దీని వల్ల అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో మొన్న జరిగిన ఎన్నికల్లో పోలింగ్ నాటికి, కౌంటింగ్ నాటికి 53లక్షల ఓట్ల తేడా ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, డీసీసీ మాజీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, టీబీజీ గుప్త, గొరింట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో రాజీకి చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న న్యాయాధికారి మాధురి

పలాస, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యే క్రిమినల్ కేసులను గుర్తించి పరిష్కరించాలని పలాస జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి పోలీసు అధికారులను కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులకు నోటీసులు ఇచ్చి.. రాజీ పడే క్రిమినల్ కేసులు పరిష్కరిండచానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐ పి.సూర్యనారాయణ, ఏపీపీ వి.రమేష్, ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు, పలాస, వజ్రపుకొత్తూరు పోలీసులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొండలపై ఉన్న గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంఘం నాయకురాలు బి.ధరణి ఆధ్వర్యంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గూడ గ్రామంలో పాఠశాలకు విద్యుత్, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రహదారి పనులు మధ్యలో వదిలేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. తాగునీటి కోసం కొండదాటి 3 కిలోమీటర్లు వెళ్లి నేల బావిలో నీరు తీసుకు వస్తున్నామని తెలిపారు. గతంలో కాలనీ ఇళ్లు ఇచ్చినా బిల్లులు ఇవ్వలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు పనులు పూర్తి చేస్తామని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో గూడ, కేరాశింగి గ్రామాల ప్రజలు ఉన్నారు.

డివిజన్ మార్చకుంటే ప్రజలకు ఇబ్బందులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

ఎల్.ఎన్.పేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎల్.ఎన్.పేట మండలాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్ నుంచి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు మార్చకుంటే మండల ప్రజలకు ఇబ్బందులు తప్పవని సర్పంచ్‌లు జి. యోగీశ్వరరావు, ఎం.యోగీశ్వరి అన్నారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్ జె.ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో ఉన్నందున రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ మండలాన్ని టెక్కలి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు మార్చాలని కోరుతున్నారు. వీరితోపాటు ఎం.శ్రీనివాసరావు, బి. చంద్రరావు, బి. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో వర్షం

మెళియాపుట్టి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాలు లేక వరి నాట్లు ఎండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లకు వర్షం కురవడంతో వరికి ఊపిరి పోసినట్లయిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీరు అందించాలి

టెక్కలి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాతనౌపడ ప్రాంతానికి వంశధార కాలువ ద్వారా సాగునీరు అందించాలని కోరుతూ ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి సోమవారం రైతులు వినతిపత్రం అందజేశారు. ఏటా వంశధార నీరు అనంతసాగరానికి వచ్చేదని.. ఈ ఏడాది రాకపోవడంతో సుమారు 300 ఎకరాలలో వరి నాట్లకు అవకాశం లేదని తెలిపారు.

అర్జీల పరిష్కారానికి కృషి

టెక్కలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల అర్జీల పరిష్కారానికి కృషి చేయాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వేదికలో వివిధ వర్గాల వారి నుంచి 21 అర్జీలను స్వీకరించారు.

కేజీబీవీ విద్యార్థినికి బంగారు పతకం

హరిపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ అంతర్ జిల్లా అథ్లెటిక్ పోటీల్లో మందస కేజీబీవీ విద్యార్థిని ఎ.పూర్ణిమ జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించింది. చీరాలలో జరుగుతున్న ఈ పోటీల్లో అండర్ -20లో పూర్ణిమ మొదటి స్థానంలో నిలిచింది. చాగల్లులో జరిగిన టార్గెట్ బాల్ మిక్స్‌డ్ టోర్నమెంట్‌లో పదో తరగతి విద్యార్థిని బి.భావన తృతీయ స్థానాన్ని సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.వాసంతి తెలిపారు.

బుక్‌లెట్లలోనే పరీక్షలు రాయాలి

జలుమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎఫ్ఎ-1 పరీక్షలను అసెస్మెంట్ బుక్‌లెట్లలోనే రాయాలని ఎంఈవో బి.మాధవరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో ఎఫ్ఎ-1 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎంఈవో-2 ప్రసాదరావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై దృష్టి

జలుమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణపై అందరూ దృష్టి పెట్టాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గొలివి సుజాత కోరారు. లింగాలవలస ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ గోడపత్రికను సోమవారం ఆవిష్కరించారు.

'అన్నదాత'కు దరఖాస్తు చేసుకోండి

నందిగాం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేసిన అన్నదాత సుఖీభవతో లబ్ధిపొందని వారు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు. రైతులు భూమి వివరాలు, ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రాలను, తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.